## క్లుప్తంగా

### నేటి నుంచి ఎల్లమ్మతల్లి జాతర

**సంతబొమ్మాళి:** మండలంలోని మర్రిపాడు గ్రామంలో గురువారం నుంచి శనివారం వరకు ఎల్లమ్మతల్లి జాతర జరగంది. దీని కోసం కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. చివరి రోజున జరగనున్న జాతర సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఎల్లమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు.

### పరీక్ష సామగ్రి వితరణ



పరీక్ష కిట్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

**కాశీబుగ్గ:** మందస మండలం సొండిపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయులు నారాయణరావు ఆదర్శంగా నిలిచారు. పదో తరగతి విద్యార్థులకు అవసరమైన పరీక్ష సామగ్రిని సొంత నిధులతో సమకూర్చారు. ప్లాంక్, స్కేల్, రబ్బర్ మెండర్, పెన్నులు, పెన్సిల్, హాల్ టికెట్ కవర్‌తో కూడిన కిట్లను ప్రధానోపాధ్యాయులు సుందరసాల్మాన్ సమక్షంలో విద్యార్థులకు బుధవారం అందజేశారు.

### వృద్ధుడు అదృశ్యం



**కాశీబుగ్గ:** పలాస మండలం చినంచల గ్రామానికి చెందిన వృద్ధుడు ఉప్పాడ వసంతులు ఈనెల 4వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య మిన్నమ్మ కాశీబుగ్గ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. ఆరోజు సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి మరలా ఇంటికి రాలేదని పేర్కొన్నారు. బంధువులు, కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా కనిపించడం లేదన్నారు. ఆచూకీ తెలిస్తే 79899 38350 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

### తెలుగు మహాసభలకు పలాస రచయితలు

**కాశీబుగ్గ:** రాయపూర్ గుడియారి మంగళ భవన్‌లో ఈనెల 8, 9 తేదీల్లో జరగనున్న ఛత్తీస్‌గఢ్ ద్వితీయ తెలుగు మహాసభలకు పలాసకు చెందిన ఇద్దరు రచయితలకు ఆహ్వానం అందింది. జన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి, అధ్యక్షుడు డాక్టర్ కుమార్ నాయక్‌లు సభలకు హాజరవ్వనున్నారు. వీరిద్దరూ రచయితలు, నటులుగా రాణిస్తున్నారు.

### వ్యక్తి అదృశ్యంపై ఆందోళన



**ఇచ్ఛాపురం రూరల్:** ఉపాధి కోసం వలస వెళ్లిన ఒక వ్యక్తి ఆచూకీ లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కేధారిపురం గ్రామానికి చెందిన కాయ లోకనాథం ఐదు నెలల క్రితం ఉపాధి కోసం, అదే గ్రామానికి చెందిన స్నేహితులతో కలిసి కాకినాడలో కన్‌స్ట్రక్షన్ పనులు చేసేందుకు వెళ్లాడు. కొన్ని రోజుల పాటు స్నేహితులతో కలిసి పనిచేసిన లోకనాథం ఎవరికీ చెప్పకుండా అక్కడ నుంచి వేరే ప్రాంతానికి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తమ కుమారుడు నుంచి ఎటువంటి సమాచారం లేకుండా పోయిందని తండ్రి కామరాజు బుధవారం ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# ప్రజల ఘోష!



కోటిపల్లిలో అలంకారప్రాయంగా మారిన కుళాయిలు



సవరబాణాపురంలో నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

- వేసవి ప్రారంభమైనా పూర్తికాని జలజీవన్ మిషన్ పనులు
- దృష్టిసారించని కూటమి సర్కార్
- నీటి కోసం ప్రజల ఇక్కట్లు

**నందిగాం:**

ప్రతి ఇంటికీ మంచినీటిని అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో సగం నిధులతో జలజీవన్‌మిషన్ పథకాన్ని రూపొందించాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందుల్లేకుండా ప్రతి ఇంటి ముందు కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీరు అందించాలనేదే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అయితే గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జరిగిన పనులు తప్పితే నేటి వరకు కూటమి ప్రభుత్వం ఈ పథకం వైపు దృష్టి సారించలేదు. నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా పథకం లక్ష్యం నీరుగారుతుంది. ఫలితంగా ప్రజలు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. నందిగాం మండలంలోని 37 పంచాయతీల పరిధిలో ఉన్న 110 గ్రామాలకు జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ మంచినీరు అందించేందుకు 2022లో రూ. 13.9 కోట్లు మంజూరయ్యాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో 34 గ్రామాల్లో మూడు కోట్ల రూపాయలకు పైగా నిధులు ఖర్చు చేసి పనులు పూర్తి చేసి ఇంటింటికీ నీటి సదుపాయం కల్పించారు. 21 గ్రామాల్లో పైపులైన్లు కూడా ఏర్పాటు చేశారు. మిగతా గ్రామాల్లో పనులు చేపట్టవలసి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క గ్రామంలో కూడా ఈ పథకం ద్వారా పనులు చేపట్టలేదు. దీంతో వేసవిలో నీటి తిప్పలు తప్పవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వేసవి తీవ్రత దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి మంచినీరు అందించాలని వేడుకున్నారు.

### మంచినీటికి అవస్థలు



వేసవి వచ్చిందంటే మా ఊరులోని ఆడవాళ్లకి నీటి కోసం తిప్పలు తప్పడం లేదు. మంచినీటి కోసం ఇబ్బంది పడుతూనే ఉన్నాము. గ్రామంలోని బావి అడుగంటింది. బోర్లు లేవు. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న బోరు నుంచి నీటిని తెచ్చుకొని అవసరాలు తీర్చుకుంటున్నాం. మాలాంటి నీటి సదుపాయం లేని గ్రామానికి కుళాయిలు వేసి నీటిని అందించాలి.

– జోగ బానమ్మ, కొటియా కొండపేట, శివరాంపురం పంచాయతీ

### పైపు లైన్లు వేసి వదిలేశారు



ఇంటింటికీ మంచినీరు అని చెప్పి పైపులైను వేశారు. కానీ ఇంతవరకు నీరు ఇవ్వడం లేదు. వేసవిలో నీటి కష్టాలు తప్పేలా లేవు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఎలాగూ ఇవ్వడం లేదు. కనీసం మంచినీరైనా ఇప్పించి దాహం తీర్చాలి.

– బాలక ప్రమీల, దిమిలాడ, నందిగాం మండలం

### జూన్ చివరకు పూర్తి చేస్తాం



నందిగాం మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా చేసే పనులను జూన్ 20వ తేదీలోగా పూర్తి చేయాలని డెడ్ లైన్ పెట్టారు. కలెక్టర్ కూడా రివ్యూ చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో పనులు పూర్తి చేసి మంచినీరు అందిస్తాం. మండలంలో ఉన్న బోర్లు తనిఖీ చేస్తున్నాం. మరమ్మతులు ఉంటే వెంటనే బాగు చేసి సమస్యను పరిష్కరిస్తాం.

– కురేష్ బెహరా, ఏఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, నందిగాం

## పూర్వ విద్యార్థి ఔదార్యం



కుళాయిలను ప్రారంభిస్తున్న దృశ్యం

**సంతబొమ్మాళి:** దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థి ఇచ్ఛాపురం నరేష్ చదువుకున్న బడి రుణం తీర్చుకొని ఆదర్శంగా నిలిచారు. కొత్తూరు గ్రామానికి నరేష్ 2008–09 విద్యా సంవత్సరంలో దండుగోపాలపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి బెంగళూరులోని ప్రముఖ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. చదివిన పాఠశాలకు మంచి చేయాలని సంకల్పించారు. నీటి కోసం విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండటానికి సుమారు రూ. 25 వేలతో తరగతి గదులన్నింటికీ పైపులైన్లు వేయించి కుళాయిలను బుధవారం ఏర్పాటు చేయించారు. హెచ్‌ఎం కోత చైతన్య మాట్లాడుతూ.. పూర్వవిద్యార్థి నరేష్ సాయాన్ని కొనియాడారు. కార్యక్రమంలో వాయుపుత్ర యూత్ అధ్యక్షుడు అట్టాడ ప్రసాద్, ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, తిరుపతిరావు, నాగేశ్వరరావు, లక్ష్మి, పార్వతి, రాము, ఉమ, చిన్నారావు, మురళీధరరాజు, రవికుమార్, విజయలక్ష్మి, మార్కండేయులు, శ్రీనివాసరావు, దయాసాగర్ పాల్గొన్నారు.

## యాప్‌లో విధిగా హాజరు నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

**కవిటి:** ప్రభుత్వ ఉద్యోగులు విధులకు వచ్చే సమయాన్ని పారదర్శకంగా నివేదించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అటెండెన్స్ యాప్ హాజరు నమోదుపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రానున్న వేసవి సీజన్‌కు సంబంధించి నీటి ఎద్దటి నివారణ చర్యలకు చేపట్టాల్సిన తక్షణ చర్యలపైఆ ర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ వంశీతో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులు డ్యూటీకి హాజరయ్యే సమయం, డ్యూటీ నుంచి ఇంటికి వెళ్లే సమయాల్ని సక్రమంగా అటెండెన్స్‌యాప్‌లో విధిగా నమోదు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో తిరుమలరావు

**కంచిలి:** బూరగాం గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమం కింద ఉపాధి హామీ పథకం నిధులు రూ. 30 లక్షలతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు పనులను ఎంపీడీవో వి.తిరుమలరావు బుధవారం పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని పనులు చేస్తున్న వారికి సూచించారు. పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రేమ్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎ.మోహన్‌బాబు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో చిన్నారికి గాయాలు



తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న కుమార్



చికిత్స పొందుతున్న చిన్నారి సాక్షి

**టెక్కలి రూరల్:** సంతబొమ్మాళి మండలం పోతునాయుడుపేట గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదేళ్ల చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం మండలం బలరాంపురం గ్రామానికి చెందిన చిన్నారి కొయ్య సాక్షి తన కుటుంబ సభ్యులతో కలిసి సంతబొమ్మాళి మండలం పోతునాయుడుపేట గ్రామంలో జరుగుతున్న వివాహానికి వచ్చింది. అయితే పెళ్లి మండపం వద్ద చిన్నారి ఆడుకుంటుండగా, అటుగా వస్తున్న పికప్ వ్యాన్ ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో వెంటనే గాయపడిన చిన్నారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఘటనపై సంతబొమ్మాళి పోలీసులకు సమాచారం అందించారు.

**మరో ఇద్దరికి గాయాలు**

టెక్కలి మండలంలోని చాకిపల్లి గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. టెక్కలికి చెందిన బమ్మిడి కుమార్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై చాకిపల్లి నుంచి టెక్కలి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా చాకిపల్లి గ్రామానికి చెందిన పంగ దేవేంద్రరావు అనే వ్యక్తి మరో ద్విచక్ర వాహనంపై వస్తూ ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలపై ఉన్న ఇరువురికీ తీవ్రగాయాలయ్యాయి. గాయపడినవారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

## ఐటీడీఏ పీవో విస్తృత పర్యటన



కంచిలి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

**కంచిలి:** సీతంపేట ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి బుధవారం కంచిలి మండల పరిధిలో విస్తృతంగా పర్యటించారు. నువాగడ ఆశ్రమ పాఠశాలను సందర్శించి మరుగుదొడ్లను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని, మరమ్మతులకు గురైన టైల్స్ మార్చాలని సిబ్బందికి సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులతో అన్నారు. అనంతరం నువాగడలో ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించి రోజూ తెరవాలన్నారు. మఠం సరియాపల్లి పీహెచ్‌సీని కూడా సందర్శించి ఓపీ రిజిస్టర్‌లను, ప్రసవాల క్యాలెండర్‌ను పరిశీలించారు. పీహెచ్‌సీలో లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కంచిలి పీహెచ్‌సీని కూడా సందర్శించారు.

**నందిగాం:** నందిగాం, నౌగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, జయపురం ఆశ్రమ పాఠశాలను సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలలోని రికార్డులను పరిశీలించారు. ఓపీ రికార్డు, పరికరాలు, మందుల సరఫరా, ల్యాబ్, వ్యాక్సినేషన్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ఇద్దరు స్టాఫ్ నర్సులు లేరని.. నియమించాలని నందిగాం వైద్యాధికారిణి కె.అనిత పీవోను కోరారు.

## ఎమ్మార్సీ సిబ్బంది నిరసన



నిరసన ప్రదర్శనలో ఎమ్మార్సీ సిబ్బంది

**సంతబొమ్మాళి:** తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ మండల రిసోర్స్ కేంద్రం సిబ్బంది బుధవారం మండల కేంద్రంలో నిరసన తెలియజేశారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, హెచ్‌ఆర్ పాలసీ, మినిమం ఆఫ్ టైం స్కేల్, గ్రాడ్యూటీ, సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేసి అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు.

## సమ్మెకాలం ఒప్పందాలు అమలు చేయాలి



నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్షా సిబ్బంది

**టెక్కలి:** సమగ్రశిక్షాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి సమ్మె కాలంలో ఇచ్చిన హామీల ప్రకారం ఒప్పందాలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం టెక్కలిలో సంబంధిత సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదురుగా మధ్యాహ్న భోజన సమయంలో ఫ్లకార్డులో నిరసన తెలియజేశారు. హెచ్‌ఆర్ పాలసీ, ఎంటీఎస్, గ్రాట్యూటీ, పదవీ విరమణ వయసు తదితర డిమాండ్లపై గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. డి.రవి, సంతోష్‌కుమార్, పి.జగదీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంధకారంలో దీపావళిపేట!

**టెక్కలి రూరల్:** మండలంలోని అయోధ్యపురం పంచాయతీ పరిధి దీపావళిపేట గ్రామం రెండు రోజులుగా అంధకారంలో ఉంది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు జేసీబీతో పనులు చేస్తుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో విరిగిపోయింది. గ్రామానికి విద్యుత్ సరఫరా జరుగు వైర్లు తెగిపోవడంతో సరఫరా నిలిచిపోయినట్టు స్థానికులు తెలిపారు. దీంతో అంధకారంలో మగ్గుతున్నామని, కరెంటు లేకపోవడంతో మోటార్లు పనిచేయక నీటి కోసం అవస్థలు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియల కోసం మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

**కంచిలి:** మండపల్లి గ్రామంలోని సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థానంలో ఉంటున్న 80 ఏళ్ల అనాథ వృద్ధురాలు వయోభారంతో బుధవారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి అంత్యక్రియలను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుళ్ల రమేష్, మోహన్‌ల ఆధ్వర్యంలో చేపట్టగా..అందుకోసం రూ. పదివేలు ఖర్చులను సోంపేటలో నివాసం ఉంటున్న రాజమండ్రికి చెందిన వ్యక్తి భరించారు. ఇచ్ఛాపురం పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ టి.రామారావు, పేటూరు సవరదేవిపేటలోని మృత్యుంజయ ఫౌండేషన్ సభ్యులు దుర్గాశి మాధవరావు, బాగ ధర్మారావు, సోంపేటకు చెందిన సానా గణేష్, కిమ్మోజి ఢిల్లేశ్వరరావు సహకరించారు.

## రూ. 21 వేల ఆర్థికసాయం



సాయాన్ని అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

**పలాస:** పలాస మండలం గొల్లమాకన్నపల్లి గ్రామానికి చెందిన రాపాక తిరుపతిరావు, అరుణ దంపతులు మూత్ర పిండాల వ్యాధితో గత ఏడాది మృతి చెందారు. వారికి ఇద్దరు పిల్లలు. పెద్దమ్మాయి ప్రవల్లిక ఇంటర్మీడియెట్, అబ్బాయి ప్రణీత్ పదో తరగతి చదువుతున్నారు. వీరికి అండగా నిలవాలని మృతుడు తిరుపతిరావుతో 1998–99 విద్యాసంవత్సరంలో బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు భావించారు. రూ. 21,500 సేకరించారు. ఈ మొత్తాన్ని తిరుపతిరావు పిల్లలకు బుధవారం అందజేసి ఆదర్శంగా నిలిచారు. పూర్వవిద్యార్థులు పాలిన బాలరాజు, కోరాడ ధనరాజు, రాపాక సూర్యనారాయణ, తెప్పల శ్యామ్, వంకల మాధవరావు ఉన్నారు.

## వైభవంగా చక్రధర పెరుమాళ్ పల్లకీ సేవ

**కవిటి:** బెజ్జిపుట్టుగలోని చక్రధర పెరుమాళ్ స్వామి డోలోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం స్వామివారి పల్లకీసేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### పశువ్యాధులపై అవగాహన అవసరం

**వజ్రపుకొత్తూరు రూరల్:** మూగ జీవాలకు సంక్రమించే వ్యాధులపై పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలని పశువైద్యాధికారి మెట్ట పాపారావు అన్నారు. మండలంలోని సీతాపురం, పెద్దబొడ్డపాడు గ్రామాల్లో బుధవారం 136 మూగ జీవాలకు గాలికుంటు నివారం వ్యాధి టీకాలను వేశారు. మూగ జీవాలకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యులు జి.దేవేంద్ర, సిబ్బంది అరుణ్, సంతోష్, వాసు, మాధురి, చినబాబు ఉన్నారు.

### పేరుకుపోయిన చెత్త..



ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో చెత్త తాండవిస్తోంది. స్థానిక పంచాయతీ కార్యదర్శి ఎస్.కృష్ణ ఈవోపీఆర్డీగా అదనపు బాధ్యతలు చేపట్టారు. దీంతో పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించలేదని, కనీసం పారిశుద్ధ్యాన్ని కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి, శివాలయం, హనుమాన్ విగ్రహాలకు వెళ్లే రోడ్లపై చెత్త పేరుకుపోయింది. సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

### కిడ్నీవ్యాధిపై అవగాహన



మందస మండలం అల్లిమెరక గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కిడ్నీ వ్యాధిపై ఉద్దాన సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతిఒక్కరూ రోజూ కనీసం మూడు లీటర్ల నీటిని తప్పకుండా తాగాలని సూచించారు. సంస్థ తరఫున విద్యార్థులకు వాటర్‌బాటిళ్లను వితరణ చేశారు. కార్య క్రమంలో ఉద్దాన సేవా సమితి ప్రతినిధులు, ఉపాధ్యాయులు కొర్రాయి రమేష్, భారతి, రాపాక బన్నీరావు, ధర్మారావు, కిరణ్ పాల్గొన్నారు.

–కాశీబుగ్గ

### నేడు మద్యం దుకాణాలకు లాటరీ

**సోంపేట:** కల్లుగీత, సొండి సామాజిక వర్గాలకు మద్యం దుకాణాలను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దుకాణాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి దుకాణాల కేటాయించడానికి గురువారం ఉదయం పది గంటలకు శ్రీకాకుళంలో లాటరీ తీస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.బేబి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులందరూ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.